క్లుప్తంగా

నేడు సచివాలయాన్ని ప్రారంభించనున్న మంత్రి బుగ్గన

బేతంచెర్ల: పట్టణంలోని హనుమాన్ నగర్ కాలనీల్లోని 5వ గ్రామ సచివాల భవనాన్ని ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి బుధవారం ఉదయం 9గంటలకు ప్రారంభిస్తారని ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి తెలిపారు. అనంతరం రూ.3.70 కోట్లతో జరుగుతున్న కందకం అభివృద్ధి పనులను మంత్రి పరిశీలిస్తారన్నారు. పట్టణ ప్రజలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

ఆలయాభివృద్ధికి విరాళం

బనగానపల్లె రూరల్ : మండలంలోని నందవరం గ్రామంలోని శ్రీ చౌడేశ్వరిదేవి ఆలయ అభివృద్ధికి హైదరాబాద్‌లోని మదీనాగూడకు చెందిన బండి గురుమూర్తి కుటుంబ సభ్యులు రూ.50వేలు విరాళంగా అందజేశారు. ఈ మేరకు మంగళవారం ఆలయ ఈఓ రామానుజన్‌కు వారు నగదు ఇచ్చారు. దాతను సత్కరించి అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

వైఎస్సార్ బీమా సాయం అందజేత


బాధితురాలికి రూ. 10 వేలు అందజేస్తున్న వెంకటేశ్వరరెడ్డి

కోవెలకుంట్ల: మండలంలోని కంపమల్ల గ్రామంలో తలారి మధుసూదన్ రెండు రోజుల క్రితం గుండెపోటుతో మృతి చెందాడు. మృతుడు వైఎస్సార్ బీమా పాలసీదారుడు కావడంతో రూ. లక్ష బీమా వర్తించింది. తక్షణ సాయంగా మృతుని భార్య రామసుబ్బమ్మకు మంగళవారం గ్రామ సచివాలయ కన్వీనర్ సోముల వెంకటేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో రూ. 10 వేలు అందజేశారు. మిగిలిన రూ.90వేలు నామినీ ఖాతాలో జమ అవుతుందని సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ కార్తీక్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి నాగలక్ష్మి పేర్కొన్నారు.

యువత క్రీడల్లోనూ రాణించాలి


క్రికెట్ టోర్నీని ప్రారంభిస్తున్న చల్లా విఘ్నేశ్వర్ రెడ్డి

అవుకు: యువత క్రీడల్లోనూ రాణించాలని వైఎస్సార్‌సీపీ నేత చల్లా విఘ్నేశ్వర్ రెడ్డి సూచించారు. దసరా ఉత్సవాల్లో భాగంగా అవుకు పట్టణంలోని జిల్లా పరిషత్ పాఠశాల మైదానంలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను మంగళవారం చల్లా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యతోపాటు క్రీడల్లోనూ ఉత్తమ ప్రతిభ కనబరిస్తే మంచి భవిష్యత్ ఉంటుందని పేర్కొన్నారు. అనంతరం క్రీడాకారులకు అభినందనలు తెలిపారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత


సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేస్తున్న దృశ్యం

డోన్ : మండల పరిధిలోని కొచ్చెర్వు గ్రామానికి చెందిన నిర్మల జ్యోతి ఆసుపత్రిలో చికిత్సల అనంతరం ముఖ్యమంత్రి సహాయనిధి కింద ఆర్థిక సాయం కోసం దరఖాస్తు చేసకోగా రూ.2లక్షలు మంజూరైంది. ఈ మేరకు మంగళవారం మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి స్వగృహంలో బాధిత కుటుంబ సభ్యులకు మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ మల్లెంపల్లె రామచంద్రుడు చెక్కు అందజేశారు.

పోస్ట్‌మాస్టర్‌కు ఘనంగా వీడ్కోలు

డోన్ టౌన్ : పట్టణంలోని ప్రధాన పోస్టాఫీస్ పోస్ట్‌మాస్టర్‌గా విధులు నిర్వహిస్తూ కర్నూలు డివిజన్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్‌గా పదోన్నతి పొందిన గరీబ్ బాషాను మంగళవారం సిబ్బంది, ఏజెంట్లు ఘనంగా వీడ్కోలు పలికారు. స్థానిక కార్యాలయంలో ఆయనకు శాలువాలు కప్పి పూల మాలలతో సత్కరించారు. కార్యక్రమంలో ఉద్యోగులు నర్సప్ప, పెద్దయ్య, వీకె రామారావు, నాగభూషణం, శ్రీనివాసులు, మురళీధర్ పాల్గొన్నారు.

రైల్వే డబుల్‌లైన్ పనులకు సహకరించాలి

డోన్ రూరల్ : నూతనంగా ఏర్పాటు చేస్తున్న రైల్వే డబులైన్ పనులకు మసీద్ కమిటీ సభ్యులు సహకరించాలని తహసీల్దార్ విద్యాసాగర్ కోరారు. పట్టణంలోని మండల కార్యాలయంలో మంగళవారం తహసీల్దార్ ఆధ్వర్యంలో కొండపేట కాలనీలో ఉన్న మదీనా మజీద్ కమిటీ సభ్యులతో సమావేశమయ్యారు. మజీద్ వివరాలను సభ్యులను అడిగి తహసీల్దార్ తెలుసుకున్నారు. డబులైన్ పనులలో ఇళ్లలు పోయిన వారందరికీ నష్ట పరిహారం అందించామన్నారు. అలాగే తర్వలోనే మదీనా మజీద్‌ను ఉన్నతాధికారులతో కలసి పరిశీలించి ఎంతవరకు తొలగించాలి అనే విషయంపై నిర్ణయం తీసుకుంటామన్నారు. ఎవ్వరికీ ఇబ్బంది లేకుండా జాగ్రత్తలు తీసుకుంటామని, కమిటీ సభ్యులు సహకరించాలని కోరారు. సమావేశంలో మజీద్ కమిటీ సభ్యులు అక్బర్‌బాషా, అబ్దుల్ ఖాదర్, మౌలాలి, అన్వర్‌బాషా, మురాద్‌ఖాన్, చాంద్ పాల్గొన్నారు.


చంద్రఘంట అలంకారంలో అమ్మవారు


అన్నపూర్ణాదేవి అలంకారంలో వాసవీమాత


తిమ్మనాయినపేటలో కామాక్షిదేవి అలంకరణలో...


అన్నపూర్ణదేవి అలంకరణలో వాసవీమాత


శ్రీలలితాదేవి అలంకారంలో అమ్మవారు

వాసవీమాత.. కరుణించు..!

కోవెలకుంట్ల: దసరా ఉత్సవాలను పురస్కరించుకుని పట్టణంలో వెలసిన వాసవీ కన్యకాపరమేశ్వరీ దేవి ఆలయంలో శరన్నవరాత్ర ఉత్సవాలు మూడవ రోజుకు చేరుకున్నాయి. మంగళవారం ఆలయంలో కుంకుమార్చన, అభిషేకం, తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అమ్మవారు మహాగౌరీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. పట్టణానికి చెందిన కిషోర్‌కుమార్, వెంకట సుజాత, వెంకటసుబ్రమణ్యం, సుధామయి, రామకృష్ణయ్య, గుర్రమ్మ, ప్రవీణ్‌కుమార్, స్రవంతి దంపతులు పూజకు ఉభయదారులుగా వ్యవహరించారు. అలాగే స్థానిక అంకాలమ్మ, సరస్వతీనగర్‌లో వెలసిన ఆలయాల్లో అమ్మవారు అన్నపూర్ణాదేవి అలంకారంలో భక్తులకు కనువిందు చేశారు.

బనగానపల్లె రూరల్ : మండలంలోని నందవరం గ్రామంలో వెలసిన శ్రీ చౌడేశ్వరిదేవి అమ్మవారు మంగళవారం చంద్రఘంట అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈఓ రామానుజన్, అర్చకుల ఆధ్వర్యంలో ఉదయం ఆవాహిత పూజ, వేదపారాయణం, చండీపారాయణం తదితర పూజలు నిర్వహించారు.పట్టణంలోని కొండపేటలో వెలసిన శ్రీ వాసవీకన్యకాపరమేశ్వరిదేవి అమ్మవారు శ్రీ గాయంత్రిదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

కొలిమిగుండ్ల: దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం తిమ్మనాయినపేటలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో కామాక్షిదేవి అలంకరణలో, అంకిరెడ్డిపల్లెలో గీతాశ్రమంలో అన్నపూర్ణ అలంకరణలో భక్తులకు అమ్మవారు దర్శనమిచ్చారు.

అవుకు: మండల కేంద్రం అవుకులో వెలసిన శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరీ దేవి అమ్మవారు మంగళవారం అర్ధనారీశ్వరీ దేవీ అలంకరణలో దర్శనమిచ్చారు. అమ్మవారిని భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.


మహాగౌరీదేవి అలంకారంలో అమ్మవారు


అర్ధనారీశ్వరీ దేవీ అలంకరణలో కన్యకా పరమేశ్వరీ దేవి

డోన్ టౌన్ : దేవీశరన్నవరాత్రోత్సవాలు భక్తిశ్రద్ధల మధ్య జరుతున్నాయి. పట్టణంలోని అమ్మవారి దేవాలయాలతో పాటు ప్రత్యేకంగా కొండపేటలో కౌన్సిలర్ దినేష్‌గౌడ్ ఆధ్వర్యంలో అమ్మవారి మండపం ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే పాతబస్టాండ్‌లో కనకదుర్గమ్మ మాలదీక్షపరులు ఆధ్వర్యంలో అమ్మవారి మండపం ఏర్పాటు చేసి పూజలు నిర్వహిస్తున్నారు. శ్రీకనకదుర్గమల్లేశ్వరి ఆలయంలో మంగళవారం అమ్మవారు శ్రీలలితాదేవి ఆకారంలో దర్శనమిచ్చారు. కొండపేటలో గాయిత్రీదేవీ రూపంలో అమ్మవారు భక్తులకు దర్శనం ఇచ్చారు.

బేతంచెర్ల: దసరా శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా మంగళవారం వాసవీమాత అన్నపూర్ణాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. బనగానపల్లె రహదారిలో వెలసిన పుట్ట పెద్దమ్మ, దుర్గాపేటలో మహిశాసుర మర్ధిని ఆలయంలో కొలువైన అమ్మవారికి అర్చకులు పవన్‌కుమార్ శర్మ, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు గౌరవ అధ్యక్షులు గుండా గోపాలు, అధ్యక్ష, కార్యదర్శులు కందగడ్డల మోహన్ రావు, గురవయ్య,పసుపుల వెంకటేశ్వర్లు, ట్రెజరర్ జయ చంద్రయ్య ప్రత్యేక పూజలు చేశారు.

ధాన్యలక్ష్మి అలంకారంలో అమ్మవారు

బేతంచెర్ల : దేవీశరన్నవ రాత్రోత్సవాల్లో భాగంగాన శ్రీ మద్దిలేటి లక్ష్మి నరసింహస్వామి ఆలయంలో అమ్మవారు ధాన్యలక్ష్మి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ వేదపండితులు జ్వాలా చక్రవర్తి, కళ్యాణ చక్రవర్తి ల ఆధ్వర్యంలో వేదపారాయణ, లలిత సహస్రనామ పారాయణ 10వేల మూల మంత్ర జప హోమాదులు, నిర్వహించారు. ఆలయ ఈఓ పాండు రంగారెడ్డి, చైర్మన్ రామ చంద్రుడు పాలక మండలి సభ్యులు స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారిని మంగళవాయిద్యాల మధ్యన ఆలయ మాడవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు.


శ్రీ మద్దిలేటి నరసింహస్వామి ఆలయంలో సహస్ర దీపాలంకరణ సేవలో ధాన్యలక్ష్మి

అన్నపూర్ణదేవి అలంకరణలో వాసవీ మాత

ప్యాపిలి: స్థానిక శ్రీమత్కన్యకా పరమేశ్వరి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. మంగళవారం మహా మంగళ హారతి, కుంకుమార్చన తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం వాసవీమాత అన్నపూర్ణదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

ఆలయాల అభివృద్ధికి కృషి


మంత్రి బుగ్గనను సత్కరిస్తున్న డిప్యూటీ కమిషనర్


మునిస్వామిని అభినందిస్తున్న మంత్రి బుగ్గన

బేతంచెర్ల: ఆలయాల అభివృద్ధికి అంకితభావంతో కృషి చేస్తున్నామని ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి తెలిపారు. మంగళవారం పట్టణంలోని మంత్రి బుగ్గన క్యాంప్ కార్యాలయంలో డోన్ నియోజకవర్గంలోని ఆలయాల అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. రూ.6 కోట్లకుపైగా నిధులతో జరుగుతున్న ఆలయాల పనుల పురోగతిపై దేవదాయ శాఖ జిల్లా డిప్యూటీ కమిషనర్ గురుప్రసాద్‌ను మంత్రి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్యాపిలి మండలంలోని రూ.1.74 కోట్లతో కంబగిరి స్వామి, రూ1.90 కోట్లతో డోన్ మండలంలోని గుండాల చెన్నకేశవస్వామి క్షేత్రం, బేతంచెర్ల పట్టణంలోని ఆంజనేయ స్వామి ఆలయంలో రూ.1.50 కోట్లతో జరుగుతున్న పనుల పురోగతిని మంత్రికి వివరించారు. డిసెంబర్‌కు అన్ని ఆలయాల పనులు పూర్తి చేసి ఆకర్షణీయంగా నిర్మాణాలు తీర్చిదిద్దాలని మంత్రి బుగ్గన ఆదేశించారు. అనంతరం దేవాదాయశాఖ డిప్యూటీ కమిషనర్ గురు ప్రసాద్ నెట్టికంటి కసాపురం ఆంజనేయ స్వామి ప్రసాదాన్ని మంత్రి బుగ్గనకు అందజేసి, పట్టు వస్త్రంతో సత్కరించారు. కార్యక్రమంలో మద్దిలేటిస్వామి ఆలయ ఈఓ పాండు రంగారెడ్డి, డిప్యూటీ ఇంజినీర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

క్రీడాకారుడిని అభినందించిన మంత్రి బుగ్గన

డోన్ టౌన్ : చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తూ డోన్ ప్రతిభను చాటాలని మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి అన్నారు. ఇటీవల కాకినాడలో జరిగిన రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీల్లో డోన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి దత్తా మునిస్వామి ఉత్తమ ప్రతిభ కనబరచి జాతీయ స్థాయికి ఎంపికయ్యాడు. ఈ మేరకు మంగళవారం మంత్రి స్వగృహంలో మునిస్వామిని బుగ్గన అభినందించారు. డోన్ నియోజకవర్గంలో విద్యారంగంతో పాటు క్రీడల్లోనూ రాణించాలని, ఇందుకు తనవంతు సహకారం ఉంటుందని ఈ సందర్భంగా మంత్రి తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలరు రైల్వే నాగేంద్ర, వ్యాయామ ఉపాధ్యాయులు అశోక్, సుధాకర్, శేఖర్, తరుణ్, సాయి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షాకుతో రైతు మృతి

బేతంచెర్ల: మండల పరిధిలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామంలో విద్యుత్ షాక్‌తో రైతు మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. ఏఎస్‌ఐ లింగమయ్య వివరాల మేరకు గ్రామానికి చెందిన వెంకట క్రిష్టారెడ్డి(49) తన పొలంలో పనిచేస్తుండగా తెగిపడిన విద్యుత్ తీగ తగిలి అక్కడి క్కక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య వెంకటలక్షమ్మతో పాటు ఒక కొడుకు, ఇద్దరు కూతుర్లు ఉన్నారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

బేతంచెర్ల: మండల పరిధిలోని సిమెంట్ నగర్‌లో ద్విచక్రవాహనం బోల్తాపడి బేతంచెర్ల పట్టణానికి చెందిన టీవీ మెకానిక్ మధు గాయాలకు గురయ్యాడు. మధు కందికాయపల్లె గ్రామానికి పని నిమిత్తం వెళ్తుండగా సిమెంట్ నగర్ గ్రామ పంచాయతీ కార్యాలయం సమీపాన బైక్ బోల్తాపడింది. 108 వాహనం కు సమాచారం ఇచ్చారు. 108 సిబ్బంది ప్రథమ చికిత్స నిర్వహించి బేతంచెర్లకు తీసుకెళ్లారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

అవుకు: అవుకు పట్టణ సమీపంలోని రిజర్వాయర్ వద్ద మంగళవారం కారు, ఆటో ఢీ కొనగా ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల మేరకు అవుకు మండలం రామాపురం గ్రామానికి చెందిన 10 మంది డ్వాక్రా మహిళలు అవుకులో పనులు ముగించుకొని తిరిగి బయల్దేరారు. రిజర్వాయర్ సమీపాన ఎదురుగా వస్తున్న కారు ఢీ కొట్టింది. దీంతో ఆటోలోని తలారి సావిత్రి, బోయ సావిత్రికి తీవ్ర గాయాలయ్యాయి. మిగతావారికి చిన్నపాటి రక్తగాయాలు అయ్యాయి. సమాచారం మేరకు 108 ఈఎంటీ పుల్లయ్య, పైలట్ వెంకటరాముడు క్షతగాత్రులను చికిత్స నిమిత్తం అవుకు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకొచ్చారు.

మిరపలో సస్యరక్షణ చర్యలు

కోవెలకుంట్ల: ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన మిరప పంటలో ప్రస్తుతం ఉష్ణోగ్రతలు అధికంగా ఉన్నందున సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఉద్యానవన శాఖ అధికారిణి ధరణి సూచించారు. మంగళవారం స్థానిక వ్యవసాయ సబ్ డివిజన్‌లోని వివిధ గ్రామాల్లో సాగు చేసిన మిరప పంటను ఆమె పరిశీలించారు.

వ్యవసాయం లాభసాటిగా చేయడమే లక్ష్యం

బనగానపల్లె : రైతులకు నూతన సాంకేతికతను అందించి వ్యవసాయాన్ని లాభసాటిగా చేయడమే లక్ష్యమని యాగంటిపల్లె కేవీకే ప్రధాన అధికారిణి ధనలక్ష్మీ పేర్కొన్నారు. మంగళవారం కేవీకేలో కోవెలకుంట్ల, ఆళ్లగడ్డ, డోన్, నంద్యాల ఆత్మకూరు నందికొట్కూరు డివిజన్‌ల వారీగా ఒక్క రోజు శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించారు. శాస్త్రవేత్తలు రమణయ్య, సుధాకర్, బాలరాజు జీవక్రిమినాసినిలపై అవగాహన కల్పించారు.

జగనన్న కాలనీలో బోరు ఏర్పాటు

అవుకు: మండలం కుసుకుంట్ల గ్రామంలోని జగనన్న కాలనీలో ఎంపీటీసీ సభ్యురాలు పోలక ప్రత్యూష ఆధ్వర్యంలో మంగళవారం తాగునీటి అవసరాల నిమిత్తం బోరు వేశారు. ఆమె మాట్లాడుతూ ప్రజలు తాగునీటి కష్టాలను విన్నవించగా వెంటనే స్పందించి ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి బోరు వేయించారన్నారు. అంతేకాకుండా గ్రామంలో వైఎస్సార్ జలకళ పథకం ద్వారా 9 బోర్లను మంజూరు చేయించారని తెలిపారు.

ఇంటర్‌లో మంచి ఫలితాలు సాధించాలి

కొలిమిగుండ్ల: ఇంటర్ విద్యార్థులు మంచి ఫలితాలు సాధించేందుకు అధ్యాపకులు కృషి చేయాలని డీఐఈఓ సునీత సూచించారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆమె సందర్శించారు. రికార్డులు తనిఖీ చేశారు. అనంతరం స్టడీ అవర్స్‌ను పరిశీలించి విద్యార్థులతో ముచ్చటించారు. కళాశాలలో జరుగుతున్న నాడు–నేడు పనులను పరిశీలించారు. డ్రాప్‌అవుట్స్ లేకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి చెప్పారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకొని ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, అధ్యాపకులు శ్రీనివాసరెడ్డి, బాల ఓబన్న తదితరులు పాల్గొన్నారు.

సంచార అంబులెన్స్‌తో మూగజీవాలకు సత్వర వైద్యం

డోన్ టౌన్ : సంచార పశు వైద్యం అంబులెన్స్‌తో మూగజీవాలకు సత్వర వైద్యం అందుతుంది. మండల పరిధిలోని వెంకటాపురంలో మంగళవారం సంచార పశువైద్యశాల అంబులెన్స్ సిబ్బంది పశువులకు వైద్యం చేశారు. గొల్ల కేశవులు, మేడబోయిన మధు తదితర రైతుల పశువులకు సిబ్బంది ఉచితంగా వైద్య చేయడంతోపాటు మందులు అందజేశారు.

పేదల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

- పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాల వర్తింపు
- ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి


లబ్ధిదారులకు సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, చల్లా కుటుంబ సభ్యులు

అవుకు: పేదల ఆర్థికాభివృద్ధే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ధ్యేయమని, ఆ దిశగా సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పేర్కొన్నారు. అర్హతే ప్రామాణికంగా పార్టీలు, కులమతాలు, వర్గాలకు అతీతంగా పేదలందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్నారని తెలిపారు. మండల కేంద్రం అవుకు–1 గ్రామ సచివాలయ పరిధిలో మంగళవారం ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ముందుగా చల్లా కుటుంబ సభ్యులు ఆహ్వానం మేరకు చల్లా స్వగృహానికి వెళ్లిన ఎమ్మెల్యే కాటసాని అవుకు పరిస్థితులపై చర్చించారు. అనంతరం దివంగత నేత చల్లా రామకృష్ణారెడ్డి చిత్రపటానికి పూలమాలను వేసి నివాళులర్పించారు. తదనంతరం శ్రీభూలక్ష్మీ సమేత చెన్నకేశవ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలను నిర్వహించి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎంపీపీ చల్లా రాజశేఖర్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు కాటసాని ఓబుల రెడ్డి, ముఖ్య నాయకులు చల్లా విఘ్నేశ్వర్ రెడ్డి, చల్లా సూర్య ప్రకాశ్ రెడ్డి, అవుకు సొసైటీ చైర్మన్ చల్లా విజయభాస్కర్ రెడ్డి, చల్లా రఘునాథ్ రెడ్డి, అవుకు మండల కన్వీనర్ కాటసాని తిరుపాల్ రెడ్డి, నాయకులు దుగ్గిరెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి, పోతిరెడ్డి శ్రీనివాస రెడ్డి, నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి ముడియాల జయ చంద్రారెడ్డి, జిల్లా ప్రచార కార్యదర్శి సిద్దంరెడ్డి రామ్మోహన్ రెడ్డి, చల్లా విక్రాంత్ రెడ్డి, అధికారులతో కలిసి ఎమ్మెల్యే అవుకులో విస్తృతంగా పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ నాలుగేళ్లలో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. ఆయా కుటుంబాలకు ప్రభుత్వం నుంచి వర్తించిన పథకాల వివరాల బుక్‌లెట్‌లను లబ్ధిదారులకు అందజేశారు. బుక్‌లెట్‌లోని వివరాల మేరకు సంక్షేమ పథకాలు అందాయా లేదా అని లబ్ధిదారులను ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. ఇళ్ల స్థలాలు, గృహాలు మంజూరు చేయించాలని స్థానికులు కోరగా వెంటనే పరిష్కార చర్యలు చేపట్టాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామ స్వరాజ్యమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పల్లెల అభివృద్ధికి రూ.కోట్లు ఖర్చు చేస్తున్నారన్నారు. ప్రజల వద్దకే పాలన కొనసాగించేందుకు మరోమారు వైఎస్సార్‌సీపీని ఆశీర్వాదించాలని ఎమ్మెల్యే కాటసాని ప్రజలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అవుకు రాజవంశీయులు నంద్యాల రామకృష్ణ రాజు, నంద్యాల త్రివిక్రమవర్మ, ఉమ్మడి కర్నూలు జిల్లాల ఎంపీటీసీల సంఘం అధ్యక్షుడు గోపవరం గోపాల్ రెడ్డి, సర్పంచ్ మందా గుర్రమ్మ, మండల సచివాలయ కన్వీనర్ తల్లం సుబ్రహ్మణ్యం, నాయకులు రామన్న, వెంకటేశ్వర్లు గౌడ్, వాయునంద గౌడ్, బత్తిని మద్దిలేటి గౌడ్, మామిళ్ల సుబ్బన్న, గాజుల కృష్ణకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పొలాల రస్తా సమస్యను పరిష్కరించండి

అవుకు గ్రామంలోని పొలాలకు వెళ్లే రస్తాలు అధ్వానంగా ఉన్నందున రైతులు ఇబ్బందులు పడుతున్నారని, పరిష్కరించాలని వైఎస్సార్‌సీపీ నేత చల్లా విఘ్నేశ్వర్ రెడ్డి ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డిని కోరారు. చీమల తిప్ప, చింతల, కుంటిమ్మ పొలాలకు వెళ్లే రస్తాలు సరిగా లేవని, రైతుల రాకపోకలు, దిగుబడుల తెచ్చుకునేందుకు అవస్థలు పడుతున్నారని ఎమ్మెల్యేకు చల్లా వివరించగా పరిష్కార చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

అవుకు రిజర్వాయర్‌కు తిమ్మరాజు పేరు పెట్టాలి

అవుకు రిజర్వాయర్‌కు తిమ్మరాజు పేరు పెట్టాలని అవుకు రాజవంశీయులు నంద్యాల రామకృష్ణరాజు, నంద్యాల త్రివిక్రమవర్మ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డిని కోరారు. కోట వీధిలో పర్యటించిన ఎమ్మెల్యే రాజవంశీయులు ఇంటికి వెళ్లి వారితో మాట్లాడారు. 15 శతాబ్దంలో మా పూర్వీకులైన నల్ల తిమ్మరాజు అవుకు సమీపంలో వెయ్యి ఎకరాల విస్తీర్ణంలో చెరువును ఏర్పాటు చేసారని వారు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. రిజర్వాయర్‌కు తిమ్మరాజు పేరు పెట్టడమే న్యాయమని తమతోపాటు ప్రజలు నిరసన తెలిపారని రాజవంశీయులు గుర్తు చేయగా విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్తామని ఎమ్మెల్యే కాటసాని హామీ ఇచ్చారు.

ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి


వృద్ధురాలు రంగమ్మతో మాట్లాడుతున్న జెడ్పీచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

కొలిమిగుండ్ల: ప్రజారోగ్య సంరక్షణే లక్ష్యంగా ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని బిఉప్పులూరు గ్రామ సచివాలయం పరిధిలోని నాగిశెట్టిపల్లెలో మంగళవారం మంగళవారం నిర్వహించిన హెల్త్ క్యాంప్‌ను జెడ్పీ చైర్మన్ సందర్శించారు. ప్రజలకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఆరోగ్య పరీక్షలు చేయించుకున్న వృద్ధురాలు రంగమ్మతో జెడ్పీ చైర్మన్ మాట్లాడారు. అవ్వా... డాక్టర్లు బాగా పరీక్షలు చేశారా... మందులు ఉచితంగానే ఇచ్చారా అని అడగ్గా వృద్ధురాలు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ఈశ్వరయ్య, ఎంపీడీఓ ప్రసాద్‌రెడ్డి, వైఎస్ ఎంపీపీ క్రిష్టారెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు పేరం సత్యానారాయణరెడ్డి, నాయకులు సత్తిగారి రామిరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, పుల్లయ్య, కంబయ్య తదితరులు పాల్గొన్నారు.

బనగానపల్లె : మండలంలోని యాగంటిపల్లె గ్రామంలో మంగళవారం ఎంపీడీఓ శివరామయ్య ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం నిర్వహించారు. డాక్టర్లు శివశంకరుడు, సోహెల్‌బాబు, మంగ్యానాయక్, ఫీరోజ్, శైలజ 926 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బండి వరలక్ష్మీ, వైఎస్సార్‌సీపీ నాయకులు బండి బ్రహ్మానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


వృద్ధులకు కంటి అద్దాలను పంపిణీ చేస్తున్న దృశ్యం

అవుకు: కునుకుంట్లలో మంగళవారం అధికారులు, డాక్టర్లు జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంప్ నిర్వహించారు. డాక్టర్లు వినోద్ కుమార్, యమునా, నవీన్, గైనకాలజిస్ట్ ప్రశాంతి 516 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

సంజామల : కమలపూరిలో మంగళవారం ఎంపీడీఓ నాగకుమార్ ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంప్ నిర్వహించారు. సీనియర్ వైద్యులు హర్షవర్ధన్, శాంకుమార్, శ్రీకాంత్, సుధాజయంతి 566 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

బేతంచెర్ల: ప్రజా సంక్షేమంతో పాటు ప్రతి పేదవాడికి ఆరోగ్యాన్ని అందించడమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారని ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల నాయకులు బాబుల్ రెడ్డి, గూని నాగరాజు, ఆర్వేటి శేఖరయ్య అన్నారు. మంగళవారం మండలరిధిలోని ఎం,పేండేకల్లులో ఎంపీడీఓ దస్తగిరి బాబు, ఈఓ ఆర్డీ వెంకట రంగనాయక్, సర్పంచ్ రామక్క, ఎంపీటీసీ మహేశ్వరమ్మ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన హెల్త్ క్యాంప్‌ను ఎంపీపీ ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ తిరుమలేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్యాపిలి: మండల పరిధిలోని మెట్టుపల్లిలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్లు ఇంతియాజ్ ఖాన్, వాణిశ్రీ, జార్జ్, పావని తదితరులు 435 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

ప్రజారోగ్యానికి పెద్దపీట


ఓపీ నమోదు చేసుకుంటున్న మహిళలు

కోవెలకుంట్ల: ప్రజా ఆరోగ్యానికి పెద్దపీట వేసి ఆరోగ్యంపై ప్రజలకు శ్రద్ధ పెరిగేలా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తోందని ఏపీ ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ కర్రా గిరిజా హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. మంగళవారం కోవెలకుంట్ల మేజర్ గ్రామ పంచాయతీలోని ఐదవ గ్రామసచివాలయ పరిధిలో ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. వైద్య శిబిరాన్ని మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ మెట్ల సరళ, ఉపసర్పంచ్ జీసీఆర్ సూర్యనారాయణరెడ్డి, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ బీవీ నాగార్జునరెడ్డి, గ్రామ సచివాలయ మండల కన్వీనర్ మధుసూదన్‌రెడ్డి, చిక్కేపల్లి ప్రసాదరెడ్డి తదితరులు సందర్శించారు. ఆయా కాలనీలకు చెందిన 737 మంది ఓపీ నమోదు చేసుకున్నారు. కోవెలకుంట్ల సీహెచ్‌సీ, మాయలూరు పీహెచ్‌సీ డాక్టర్లు చంద్రశేఖర్‌రెడ్డి, షర్మిలాభాను, రాబర్ట్‌కెన్నెడి, అశోక్ ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం ఆకుకూరలు, కూరగాయలు, పోషకాలతో కూడిన ఆహార పదార్థాలతో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను వారు పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సయ్యదున్నీసా, తహసీల్దార్ పుష్పకుమారి, డిప్యూటీ తహసీల్దార్ చంద్రశేఖర్, ఐసీడీఎస్ సీడీపీఓ ఉమామహేశ్వరి, సూపర్‌వైజర్లు గీతాలక్ష్మి, హెల్త్ సూపర్‌వైజర్లు మునిస్వామి, వీరభద్రుడు, వైద్య సిబ్బంది, ఆశావర్కర్లు, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.